క్లుప్తంగా

పచ్చదనం పెంపొందిద్దాం



హైస్కూల్లో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

పులిచెర్ల(కల్లూరు): పాఠశాలలో పచ్చదనం పెంపొందించడానికి ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని నేషనల్ గ్రీన్ కార్ప్స్ జిల్లా సమన్వయకర్త బాల చైతన్య కోరారు. కల్లూరు హైస్కూలుకు జాతీయ స్థాయిలో అవార్డు రావడంతో సోమవారం ఆయన ఆ స్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులతో మొక్కలు నాటించారు. హెచ్‌ఎం శ్రీవాణి, ఉపాధ్యాయులు వెంకటసిద్దులు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రూ.35 లక్షలతో సీసీ రోడ్డు



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న స్థానిక నాయకులు

కుప్పం రూరల్: మండలంలో పంచాయతీ కేంద్రం ఉర్లవోబనపల్లె నుంచి పరమసముద్రం చెరువు వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం సర్పంచ్ అబ్బు, స్థానిక నాయకులు భూమి పూజ చేసి ప్రారంభించారు. సచివాలయం నుంచి పరమసముద్రం చెరువు వరకు 600 మీటర్ల పొడవు రోడ్డును రూ.35 లక్షలతో వేయనున్నట్టు అబ్బు చెప్పారు. ఈ రోడ్డు పూర్తయితే ఉర్లవోబనపల్లె–గోనుగూరు గ్రామస్తులకు రవాణా, రాకపోకలకు సౌకర్యవంతంగా ఉంటుందని ఆయన చెప్పారు.

ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ



కల్లూరులో ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న సర్పంచ్ షుకూర్

పులిచెర్ల(కల్లూరు): కల్లూరులో సోమవారం ఆరోగ్యశ్రీ కార్డులను స్థానిక సర్పంచ్ షుకూర్ పంపిణీ చేశారు.ఆరోగ్య శ్రీలో ఉచితంగా రూ.25 లక్షల వరకు వైద్య సేవలు పొందగలిగేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పించారన్నారు. ఎంపీటీసీ రెడ్డి అహమ్మద్, షౌకత్ అలీ, డాక్టర్ జానకీరావు, సచివాలయ కన్వీనర్ షాహీనా తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం



పులిచెర్ల(కల్లూరు): మండలంలోని రేణుమాకుల పల్లె పంచాయతీలో సోమవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 240 పశువులకు వివిధ రకాల చికిత్సలు చేసి పాడి రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ వెంకటేశ్, వాటర్‌షెడ్ చైర్మన్ రాజేష్, పశువైద్యాధికారి శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం


చిట్టిబాబు


హరినాథ్


దామోదరం

కుప్పం రూరల్: ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా కుప్పం మండలం అడవిబూదుగూరు ఉపాధ్యాయుడు చిట్టిబాబును ఎంపిక చేశారు. ఆదివారం చిత్తూరులో జరిగిన కార్యవర్గ సమావేశంలో మండలానికి చెందిన ఉపాధ్యాయులకు సముచిత స్థానం కల్పించారని చిట్టిబాబు చెప్పారు. అలాగే జిల్లా కార్యదర్శిగా హరినాథ్, కుప్పం డివిజన్ కన్వీనర్‌గా దామోదరంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. వీరి ఎంపికపై మండలంలోని ఎస్టీయూ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

31న మున్సిపల్ సమావేశం

పుంగనూరు: వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించేందుకు మున్సిపాలిటీ అత్యవసర సమావేశం ఈనెల 31న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు చైర్మన్ అలీమ్‌బాషా విలేకరులకు తెలిపారు. సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

భక్తిప్రపత్తులతో సంకటహర చతుర్థశి

పలమనేరు: పట్టణంలోని బసవేశ్వర ఆలయంలో సంకటహర చతుర్థశిని సోమవారం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.భక్తులకు స్వామి వారి ప్రసాదాల వితరణ చేశారు. ఆలయ నిర్వాహకులు, అర్చకులు పాల్గొన్నారు.

ఈరోజు

మండల సర్వసభ్య సమావేశం

గంగవరం: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు, పంచాయతీల సర్పంచులు హాజరు కావాలని కోరారు.

చలమంగళం, పెద్దారికుంటలలో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్





ఇళ్ల వద్దకే వైద్యసేవలు

ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేసింది. గత ఏడాది ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామీణుల ఇళ్ల ముంగిటకే వైద్య సేవలు అందేలా చేసింది. ఫలితంగా అత్యవసరమైన వైద్యసేవలకు తప్పితే ప్రజలు ఆస్పత్రులకు వెళ్లే అగత్యం తప్పింది. ప్రజల నుంచి కూడా దీనికి మంచి స్పందన లభిస్తుండడంతో వైద్యసేవలు కూడా విస్తరించాయి. ప్రభుత్వం ఆశించిన సత్ఫలితాలు సాధిస్తూ వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులతో ముందుకువెళ్తోంది.

- ప్రజారోగ్యానికి పెద్దపీట
- వైద్యరంగానికి జవసత్వాలు
- ఇళ్ల ముంగిటే వైద్య పరీక్షలు, 67 రకాల మందులు
- 2 వేలమందికో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్



దండపల్లెలో వైద్యసేవలందిస్తున్న వైద్యులు

పలమనేరు: నియోజకవర్గంలో 8 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి (బైరెడ్డిపల్లె-2,గంగవరం-2, పలమనేరు, వీ.కోట, పెద్దపంజాణిలలో ఒక్కొక్కటి) ఒక్కో ఆరోగ్యకేంద్ర పరిధిలో ఒక 104 వాహనం సేవలందిస్తోంది. నియోజకవర్గానికి మొత్తం 57 డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు మంజూరయ్యాయి.

దీర్ఘకాలిక రోగులకు సౌకర్యం

దీర్ఘకాలిక వ్యాధులైన మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్, కాళ్లనొప్పులు..ఇత్యాది సమస్యలతో బాధపడుతున్న వారు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నారు. వీరు వారానికోసారి పట్టణానికి వచ్చి వైద్యం పొందడం కష్టంగా మారింది. ఇక కొందరు రోగులు ఇంట్లో బెడ్‌కే పరిమితమయ్యారు. వీరికి కుటుంబీకుల ఆసరా లేనిదే కుదరదు. ఇక మరికొందరు వృద్ధాప్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నవారూ ఉన్నారు. వీరికి బీపీ, షుగర్‌లాంటి పరీక్షలు తరచూ చేయాల్సింటుంది. ఇలాంటి వారికి వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ప్రభుత్వం ఇంటి వద్దే సేవలందిస్తుండడం, వారికి అగచాట్లు తప్పాయి. 14 రకాల టెస్ట్‌లు చేసి ఫలితాలను అప్పటికప్పుడే చెబుతున్నారు. మధుమేహం, బీపీ, మలేరియా, వైరల్ ఫీవర్స్, డెంగీ, హెచ్‌ఐవీ, మూత్రపరీక్షలతో పాటు గుండెకు సంబంధించిన ఈసీజీ సైతం అందుబాటులో ఉంటున్నాయి.

నియోజకవర్గానికి మంజూరైన హెల్త్‌క్లినిక్స్	: 57
నిర్మాణం పూర్తయినవి	: 16
ఒక్కో భవన నిర్మాణానికి చేసిన వ్యయం	: రూ.20.08 లక్షలు
మొత్తం అంచనా వ్యయం	: రూ.11.44 కోట్లు

ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత



ఇంతకుముందు ఏ ప్రభుత్వమూ చేయని విధంగా జగనన్న పాలనలో ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చారు. డాక్టర్లు ఊర్లకు వచ్చి వైద్యసేవలు అందిస్తున్నారు. అలాగే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు పెట్టారు. బైరెడ్డిపల్లెలో కొత్త ఆస్పత్రి, అందుబాటులోనే వైద్యులు, గ్రామాల్లో 104 సేవలు, అత్యవసరమైతే 108 అంబులెన్సు..ఇవన్నీ మాకు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా ఏ రోగానికైనా ఆరోగ్యశ్రీ ఉందనే ధైర్యం వచ్చింది.

–రోజా, వెంగంవారిపల్లె, బైరెడ్డిపల్లె

వైద్యసేవలు ఎంతో మెరుగు పడ్డాయి



ఈ ప్రభుత్వంలో వైద్య సేవలు చాలా మెరుగు పడ్డాయి. ముఖ్యంగా ఇంటి వద్దకే అన్ని రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఎవరికి ఏ ఆరోగ్య సమస్య ఉన్నా వెంటనే ఆరోగ్యశ్రీ ద్వారా సంబంధింత ఆస్పత్రుల్లో వైద్యం, ఆపరేషన్లు అందుతున్నాయి. ఆయా గ్రామాల్లోనే డా. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేయడంతో ఆస్పత్రికోసం మండల కేంద్రాలకు వెళ్ళే ఇబ్బంది కూడా తప్పింది.

–డాక్టర్ మల్లికార్జునరెడ్డి, మెడికలాఫీసర్, పలమనేరు

జగనన్నే మళ్లీ సీఎం కావాలి



సి.బండపల్లెలో సారె అందుకున్న మహిళలతో దుర్గ

శాంతిపురం: ప్రతి పేద, మధ్య తరగతి కుటుంబం అభివృద్ధి బాటలో ముందుకు సాగాలంటే మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ ప్రజలను కోరారు. సోమవారం ఆమె మండలంలోని 64 పెద్దూరు, సి.బండపల్లె, కొలమడుగు పంచాయతీలలో పర్యటించారు. మహిళలను కలిసి చీర, పసుపు–కుంకుమలను సారెగా అందజేసి మాట్లాడారు. రాబోవు ఎన్నికల్లో మళ్లీ జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. గత టీడీపీ పాలనలో సంక్షేమ పథకాలు ఆ పార్టీ నాయకులు, జన్మభూమి కమిటీలు సిఫార్సు చేసిన వారికే అందేవని, అర్హులకు మొండిచేయి చూపేవారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి పార్టీకతీతంగా నేరుగా అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. సచివాలయాలు, గ్రామ వలంటీర్ల వ్యవస్థతో సంక్షేమ ఫలాలు ఇళ్ల ముంగిటకే అందుతున్నాయన్నారు. అలాగే ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేసి, పేదింటి బిడ్డలకు ఇంగ్లిష్ మీడియం చదువులు చెప్పిస్తున్నారని, వాటి ఫలాలు సైతం అందుతున్నాయన్నారు. జగనన్న ఇంతగా చేసిన మేలును గుర్తెరిగి ప్రజలకు మళ్లీ పట్టం కట్టాలని అభ్యర్థించారు. కుప్పం ప్రజలకు అందుబాటులో ఉంటూ తమ కుటుంబం ప్రజలతో మమేకమై చేస్తున్న సేవను వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ నాగమ్మ, సర్పంచులు రాధాకృష్ణ, కుమార్‌రాజా, మంజునాథ్, ఎంపీటీసీలు యువరాజ్, దేవేంద్రప్ప, నాయకులు వీరభద్రప్ప, వెంకటేశు, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం



పవిత్రను సన్మానిస్తున్న పవర్‌లూమ్ కార్మికులు

పలమనేరు: పట్టణంలోని పారిశ్రామికవాడకు చెందిన పవర్‌లూమ్ కార్మికులు, నిర్వాహకులు సోమవారం ఏపీ విశ్వ బ్రాహ్మణ అభివృద్ధి కార్పొ రేషన్ చైర్‌పర్సన్ పవిత్ర దంపతులను సన్మానించి అభినందించారు. ఇక్కడి పవర్ లూమ్‌లోని సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభు త్వం చాలా కృషి చేసిందని వారు కృతజ్ఞతలు తెలిపారు.

‘ఉత్తమ సేవ’కులకు..

సోమల: విధి నిర్వహణలో ఉత్తమ సేవలకుగాను గణతంత్ర దినోత్సవం రోజున చిత్తూరులో ప్రశంసా పత్రాలు అందుకున్న వారిని సోమవారం సన్మానించారు. స్థానిక సచివాలయం–1 పంచాయతీ కార్యదర్శి సుధాకర్ కుమార్, డిజిటల్ అసిస్టెంట్ ధరణీ చంద్రకుమార్ డీపీఓ లక్ష్మి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకోవడం విదితమే. ఈ నేపథ్యంలో వారిని వైస్ ఎంపీపీ ప్రభాకర, మాజీ సర్పంచ్ శ్రీరాములు ఆధ్వర్యంలో సన్మానించారు. కందూరు సర్పంచ్ మసూద్, నేతలు షేక్ బాషా, నక్కా నరసింహులు, సాంబయ్య, దొరబాబు, గౌస్‌పీర్ బాషా, ఆటో ప్రసాద్, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

విశిష్ట సేవలకు అవార్డులు

పుంగనూరు: విశిష్ట సేవలు అందించిన పలువురు అధికారులకు పట్టణంలోని డాక్టర్ ఏపీజె అబ్దుల్ కలామ్ చారిటబుల్ ట్రస్ట్ అవార్డులు ప్రదానం చేసింది. సోమవారం స్థానిక బసవరాజ హైస్కూల్ ట్రస్ట్ చైర్మన్ అయూబ్‌ఖాన్, కార్యదర్శి టిపిఎస్ నాగరాజ తదితరులు మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్, తహసీల్దార్ సీతారామన్, సీఐ రాఘవరెడ్డి, ప్రిన్సిపల్ దయానందరాజు, ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు, న్యాయవాది కుమార్‌రెడ్డి, టీచర్ హేమాద్రి, వ్యాపారి రాము, విశ్రాంత డీఎస్పీ సుకుమార్‌బాబు, వ్యాపారవేత్త త్రిమూర్తికి అవార్డులు అందజేశారు. శాలువలు, పూలమాలలు, జ్ఞాపికలతో వారిని సత్కరించి సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు గిరిధర్, సతీష్‌కుమార్, శ్రీనివాస్, ప్రకాష్, భద్రయ్య, పరమేష్, రజీ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.



అవార్డులు అందుకున్న కమిషనర్ నరసింహప్రసాద్, తహసీల్దార్ సీతారామన్‌లతో అయూబ్‌ఖాన్, నాగరాజ

మున్సిపల్ కమిషనర్‌గా రమణారెడ్డి



మున్సిపల్ చైర్‌పర్సన్‌ను కలిసిన కమిషనర్

పలమనేరు: పలమనేరు మున్సిపల్ కమిషనర్‌గా రమణారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా స్థానిక కమిషనర్ కిరణ్‌కుమార్‌ను ప్రభుత్వం ఆయన సొంత శాఖ హార్టికల్చర్‌కు రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. అలాగే కడప కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డిని ఇక్కడికి బదిలీ చేసింది. బాధ్యతల స్వీకరణ సందర్భంగా ఆయన స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలో సమస్యల పరిష్కారానికి, రాబోవు ఎన్నికలను సవ్యంగా నిర్వహించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపంజాణి: మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్‌రహీం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 31, 2023 నాటికి 18 ఏళ్ల పూర్తయి 35 ఏళ్ల లోపు ఉన్న 10వ తరగతి పాసైన నిరుద్యోగులు అర్హులన్నారు. బొమ్మరాజుపల్లె–1(ఓసీ ఉమెన్), శివాడి–2(బీసీ ఉమెన్, ఓసీ), సిడిగుంట–3(1ఎస్సీ ఉమెన్, 1 బీసీ ఉమెన్, 1 జనరల్), వీరప్పల్లె–1(ఎస్సీ ఉమెన్), బట్టందొడ్డి–2(బీసీ జనరల్), పెద్దకాపల్లె–1(ఎస్సీ జనరల్)కు రిజర్వు చేసినట్టు తెలియజేశారు. అర్హత కలిగిన ఆయా పంచాయతీల అభ్యర్థులు ఆ ప్రాంత పోస్టులకు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న పార్టీ నాయకులు

కుప్పం: స్థానిక 21 వార్డుకు చెందిన సంపత్ (30) ఆదివారం రైలు కింద పడి మృతి చెందారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్ స్పందించారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, రెస్కో చైర్మన్ సెంధిల్ కుమార్ చేతుల మీదుగా మృతుడి కుటుంబానికి రూ.10 వేలను అందజేశారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని ఓదార్చారు. కౌన్సిలర్ ఎంఆర్ సురేష్ పాల్గొన్నారు.

యువజన విభాగం సెక్రటరీగా రాజేష్



రాజేష్

పులిచెర్ల(కల్లూరు): జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం సెక్రటరీగా మండలంలోని రేణుమాకులపల్లెకు చెందిన జంపాల రాజేష్ నియమితులయ్యారు. తనకీ పదవి రావడానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి కారకులని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు.

జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడల్లోనూ సత్తా చాటండి



వాలీబాల్ విన్నర్స్‌కు కప్, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న మధుసూదన్‌రెడ్డి, ఎంపీపీ, కమిషనర్

- ‘ఆడుదాం ఆంధ్రా’ క్రీడాకారులకు పిలుపు
- నియోజకవర్గ స్థాయి పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం

పుంగనూరు: గ్రామీణ ప్రాంతాలలో మరుగునపడిన క్రీడా మాణిక్యాలను ఆడుదాం ఆంధ్రాతో వెలుగులోకి తెచ్చామని జిల్లా ఉద్యానవనశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో గెలుపొందిన వారికి జ్ఞాపికలు, మెడల్స్, సర్టిఫికెట్లను సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి, కమిషనర్ నరసింహప్రసాద్, తహసీల్దార్ సీతారామన్, ఎంపీడీఓ నారాయణతో కలసి ఆయన బహుమతులు అందజేశారు. పుంగనూరు వాలీబాల్ జట్టుకు మెడల్స్ వేసి, షీల్డ్ అందజేసి అభినందించారు. ఆయన మాట్లాడుతూ సుమారు నెల పాటు క్రీడాపోటీలను ఎలాంటి అంతరాయం లేకుండా నిర్వహించారన్నారు. క్రికెట్, వాలీబాల్, ఖో–ఖో, బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీల్లో ఎందరో గ్రామీణ క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకున్నారని ప్రశంసించారు. జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లో ఇలాగే రాణించి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓలు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెన్నశెట్టి, సచివాలయాల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్ ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ నాయకుడు జయరామిరెడ్డి, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

విజేతలు వీరే!

పుంగనూరు నియోజకవర్గ స్థాయి పోటీల్లో గెలుపొందిన వారి వివరాలను పీడీ మధుసూదన్‌రెడ్డి వెల్లడించారు. వాలీబాల్ పురుషుల విభాగంలో విన్నర్స్, రన్నర్స్‌గా పుంగనూరు, రొంపిచెర్ల, మూడవ స్థానంలో సదుం నిలిచాయి. మహిళల విభాగంలో రొంపిచెర్ల, పుంగనూరు, చౌడేపల్లె ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచాయి. కబడ్డీ పురుషుల విభాగంలో పుంగనూరు, చౌడేపల్లె విన్నర్స్, రన్నర్స్‌గా నిలవగా, సోమల తృతీయ స్థానంలో నిలిచింది. అలాగే మహిళ విభాగంలో సదుం, పుంగనూరు, పులిచెర్ల, ఖోఖో మహిళ విభాగంలో పుంగనూరు, రొంపిచెర్ల, చౌడేపల్లె, పురుషుల విభాగంలో చౌడేపల్లె, సదుం, పుంగనూరు, బ్యాడ్మింటన్‌లో పుంగనూరు, సదుం, సోమల, మహిళల విభాగంలో పులిచెర్ల, చౌడేపల్లె, రొంపిచెర్ల ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలయ్యాయి. ఇక క్రికెట్ బాలికల విభాగంలో రొంపిచెర్ల, పుంగనూరు విన్నర్స్, రన్నర్స్‌గా నిలవగా, పురుషుల విభాగంలో రొంపిచెర్ల, పులిచెర్ల, సోమల మండలాలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచాయి.

స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థినులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న వైవీఆర్ ట్రస్ట్ సభ్యులు



విద్యార్థులకు నోటు పుస్తకాలను ఇస్తున్న టీచర్ చెంగల్రాయన్

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు స్థానిక యోగి వేమారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు సోమవారం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. మండలంలోనే చదువుల్లో మంచి ఫలితాలను సాధిస్తున్న ఇక్కడి విద్యార్థినులను చదువుల పరంగా ప్రోత్సహించేందుకు వీటిని అందజేసినట్టు ట్రస్ట్ అధ్యక్షులు చెంగారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, కమిటీ సభ్యులు బాలాజిరెడ్డి, జయప్రకాష్‌రెడ్డి, నక్కపల్లి భాస్కర్‌రెడ్డి, అమరనాథ్, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లె హైస్కూల్‌లో నోటు పుస్తకాలు..

మండలంలోని నక్కపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అదే పాఠశాలకు చెందిన టీచర్ చెంగల్రాయన్ సోమవారం నోటుపుస్తకాలను పంపిణీ చేశారు. రానున్న పది పబ్లిక్ పరీక్షల్లో మండలంలోనే నక్కపల్లె టాప్‌లో నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ప్రారంభం



విలేజ్ క్లినిక్ ముందు వైద్యాధికారులు

బైరెడ్డిపల్లె: గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ’డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్’లు ఏర్పాటు చేస్తున్నట్లు నేషనల్ క్వాలిటీ అసెస్‌మెంట్ స్టాండర్స్ టీమ్ వైద్యాధికారులు శ్రీనాథ్‌రెడ్డి, రాజేశ్వర్, ఢిల్లీ, నిరంజన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నెల్లిపట్లలో సోమవారం విలేజ్ క్లినిక్‌ను ప్రారంభించి వారు మాట్లాడారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌చంద్ర, హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రూ.1.23 కోట్లతో శివాలయ రాజగోపుర నిర్మాణం




మాట్లాడుతున్న ఆలయ ఈఓ కమలాకర్, పక్కన చైర్మన్, సభ్యులు

పలమనేరు: పట్టణంలోని శివాలయ రాజగోపుర నిర్మాణానికి దేవదాయశాఖ రూ.1.23 కోట్లను మంజూరు చేసినట్టు ఆలయ ఈఓ కమలాకర్ తెలిపారు. ఆలయ కమిటీతో కలసి సోమవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. చారిత్రక ప్రసిద్ధి కలిగిన ఈ ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ఆలయ కమిటీ చైర్మన్ గంటే వీరభద్ర స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ సహకారంతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ద్వారా ప్రభుత్వానికి నివేదించారని తెలిపారు. దీంతో దేవదాయశాఖ ఆలయ రాజగోపురం, పుష్కరిణి, ఇతర నిర్మాణాల కోసం రూ.1.23 కోట్లను కేటాయించిందని, ఇందులో మ్యాచింగ్ గ్రాంటుగా రూ.25లక్షలు ఉంటుందని చెప్పారు. ఆలయ చైర్మన్ గంటే వీరభద్ర తన వంతుగా రూ.5లక్షల చెక్కును ఈఓకు అందజేశారు. మిగిలిన మొత్తాన్ని భక్తులు, దాతల సాయంతో చెల్లించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఎండోమెంట్ సిబ్బంది, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి అండగా నిలుద్దాం

రొంపిచెర్ల: పుంగనూరు నియోజకవర్గంలో దళితులందరూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అండగా నిలిచి ఎన్నికలలో వైఎస్సార్ సీపీని గెలిపించాలని రొంపిచెర్ల మండల దళిత సంఘం నాయకులు బండపల్లె సుభాష్ పిలుపునిచ్చారు. అయన సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి దళితులను ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచులను చేశారని, ఈ స్థాయిలో దళితులకు అండగా ఇంతవరకు ఎవరూ లేరన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని దళితులు వైఎస్సార్ సీపీకి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనికిగాను నియోజకవర్గంలో పర్యటించి దళిత సంఘాలను ఏర్పాటు చేస్తామని, దళితులకు మంత్రి, ప్రభుత్వం చేసిన సేవలను విస్తృత ప్రచారం చేస్తామన్నారు. సమావేశంలో దళిత సంఘ నాయకులు చిరంజీవి, వెంకటరమణ, లోకనాధ, హరి, రమేష్, వెంకటేష్, బాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్టీయూలో మండల టీచర్లకు స్థానం


సుబ్రమణ్యం


వెంకటరత్నం

వి.కోట: ఎస్టీయూ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశంలో మండల ఉపాధ్యాయులకు సముచిత స్థానం లభించింది. జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్‌గా సుబ్రమణ్యం, జిల్లా కార్యదర్శిగా కొటారి వెంకటరత్నం, రాష్ట్ర కౌన్సిలర్లుగా ఇలియాజ్, డాక్టర్ జనార్ధన్‌రెడ్డిని, అలాగే జిల్లా మహిళా కమిటీ సభ్యురాలిగా అమరావతి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా జానకిరాం, రఘుపతి, ఫైనాన్స్ కమిటీ మెంబరుగా జనార్ధన్‌గుప్తాను ఎంపిక చేశారని ఎస్టీయూ మండల నాయకులు తెలిపారు.

కారు ఢీకొని మోటార్ సైక్లిస్టుకు గాయాలు



గాయపడిన నాగేంద్ర

రొంపిచెర్ల: కారు–ద్విచక్ర వాహనం ఢీకొని మోటార్ సైక్లిస్టుకు గాయాలైన సంఘటన తిరుపతి–మదనపల్లె జాతీయ రహదారిలోని రొంపిచెర్ల క్రాస్ రోడ్‌లో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ కృష్ణయ్య కథనం.. అన్నమ్మయ్య జిల్లా పీలేరు మండలం గూడరేవుపల్లెకు చెందిన నాగేంద్ర (40) ద్విచక్ర వాహనంలో తిరుపతి నుంచి పీలేరుకు వెళుతుండగా పీలేరు నుంచి తిరుపతికి వెళుతున్న కారు రొంపిచెర్ల క్రాస్ రోడ్‌లో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నాగేంద్రకు తీవ్రగాలయ్యాయి. అతడిని చికిత్స నిమత్తం పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రొంపిచెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.